# దిగంబరం

పంచలో కసవూడవాలని చాలా సేపట్నుంచి ప్రయత్నిస్తోంది అపర్ణ. రెండు మంచాల నిండా కూచుని ఉన్న జనం కాళ్ళ కింద ఎట్లా పొరక కదిలించాలో అర్థం కాకుండా వుంది. కాల్చి పారేసిన బీడీ ముక్కలు నేలంతా రాలి ఉన్నాయి. బీడీ నలిపిన మసి గుర్తులు మంచం కోళ్ళ నిండా అంటుకొని వున్నాయి.

ఎంగిలి తేమంటిన పొగాకు వాసన పొగతో కలిసి పొయ్యిదాకా పాకుతోంది. ఆ వాతావరణాన్నంతా వీధిలోకి చిమ్మేయాలనేంత ఎక్కసగా వుంది ఆమెకు.

జంగిడి గొడ్లు ఇళ్ళకొచ్చిన పొద్దున్నించి మొదలైంది వాళ్ళ యవ్వారం. అందరికీ కేంద్రబిందువైన తన తండ్రి వెంగళ్‌రెడ్డిమీద ఆమె కళ్ళల్లో అసహ్యపు జీరలు పెనవేసుకుంటున్నాయి.

ప్రతిదినం అంబలి పొద్దున ప్రయాణమై దగ్గర్లోని టౌను కెళ్ళినవాడు సాయంత్రం దాకా ఇంటికి రాడు. రాత్రి సగంబొద్దుదాకా యవ్వారం. టౌనుకెళ్ళని రోజు పగలుకూడా సంత పెడతాడు.

రోజూ అతను చెప్పేది వాళ్ళు వినేది ఒక్కటే.

రాజకీయం.

పల్లెనించి ఢిల్లీదాకా అతని నాలుక బహు చమత్కారంగా కదులుతుంటుంది.

చుట్టూ మనుషుల వూఁకొట్టడాలకు మంచం కిటకిటలు వంత పలుకుతుంటాయి. ఆశ్చర్యంతో తెరచుకొనే వాళ్ళ నోళ్ళలోంచి బీడీ పొగ తీగలు తీగలుగా నాట్యం చేస్తుంటుంది.

అతను ధరించే ఖద్దరు చొక్కా చూస్తే చాలు, పొయ్యిలో విసిరేయాలనేంత కసి ఆమెకు.

ఏ ముహూర్తాన అతని వొంటిమీదకు వచ్చిందో గానీ – చెమట అంటిన పని చొక్కాను మూలకు తన్ని ఈ ఖద్దరు చొక్కా – అప్పట్నించి సంసారం యీడుబో మొదలెట్టింది.

కాడెద్దులు, బర్రెలు, గరిసెలు, గాదెలు, కాగులు – అన్నిట్నీ తినేసి ఇళ్ళంతా బీడు భూమిని చేసింది. పెద్దలు సంపాదించిన భూముల్ని కూడా మింగేసి కొంప మాత్రం మిగిల్చింది.

రోజూ పొలాల గెట్లంట టౌనుకు నడిచి వెళ్ళొస్తుంటాడు గానీ పొలాల గురించి మరచిపోయాడు. ఇప్పుడు దమ్మిడీ పనిలేదు. పైసా రికాణా లేదు.

"అపర్ణా! అంగడికి పోయి బీడీ కట్ట ఇప్పించక రాపో"

ఆలోచనల్నుంచి తేరుకొంది అపర్ణ.

బీడీలు కూడా తనే పంచి నోటితీత వదిలించుకొనేంత దుస్థితి.

నిర్లక్ష్యపు చూపొకటి అతనికేసి విసరి ఇంట్లోకి నడిచింది.

పొయ్యి ఊదుతూ వుంది మేనత్త చంద్రమ్మ. తనకంటే పదేళ్ళు పెద్దదయినా తనతో ఇంకా కుమారిగానే ఎదలు కలుపుకు తిరుగుతూ ఉంది.

"ఏం జేస్తాందవత్తా?" అంటూ కుండ మూత తీసి చూసింది. మధ్యాహ్నం మిగిలిఉన్న అరపావు బియ్యాన్ని ఉడకేస్తోంది.

"బాగా ఉడకనీ. బియ్యంలో సారమంత గంజిలోకి రావాల" నవ్వుతూ చెప్పింది.

"మ్మేయ్ అపర్ణా!" బైట్నించి అరుపు.

కదలక తప్పలేదు అపర్ణకు.

అంగడి సుబ్బన్న నిన్ననే చెప్పాడు – 'పాత బాకీ తీర్చకుంటే పైపా అప్పివ్వ'నని.

పది నిమిషాల్లో తిరిగి వచ్చింది ఆమె. "లేవంట" చెప్పింది – అంత మందిలో నిజాన్ని విప్పలేక. వెంగళ్‌రెడ్డికి కూడా విషయం అర్థమైంది.

"లేకేం? ఈ రోజే సరుకులు తెస్తే. ఫలానా మార్కు బీడీలని అడిగేందుకు నీకు చేతనై వుండదు. మీ అమ్మను పొమ్మను" చెప్పాడు.

"లేదు"

"అత్తో"

"ఉంది"

"చెప్పు ఫో" సీరియస్‌గా చూశాడు.

"ఎవరు పోయినా ఒకటే. అప్పు లేదన్నెడు."

ఓపిక బద్దలవుతూండగా పొయ్యి వద్దకు నడిచింది.

ఆమె ఊహించినట్లే బైటి వాతావరణంలో తుపాను చెలరేగింది.

చంద్రమ్మ విస్తుబోయి చూస్తోంది అపర్ణకేసి.

అంగడి సుబ్బయ్య ఎట్లా అడుక్కొంటూ ఊర్లోకి వచ్చిందీ, తన పూర్వీకులు అతనికి ఎట్లా ఆశ్రయమిచ్చింది అరచి చెబుతున్నాడు. సుబ్బయ్య విశ్వాసఘాతుకత్వాన్ని వినరాని భాషలో తూరుపెత్తుతున్నాడు. అపర్ణమీది కోపాన్నంతా సుబ్బయ్య మీద కక్కుతున్నాడు.

చేయరాని తప్పే చేసింది అపర్ణ.

అప్పు తెచ్చేందుకు తనకు చేతగాకుంటే అమ్మకో, అత్తకో చెప్పాలి.

వాళ్ళక్కూడా చేతగాకుంటే ఇంట్లోంచి గింజలు తీసికెళ్ళి కొనుక్కురావాలి.

గింజలు లేకుంటే పక్కింట్లో బదులడగాలి. పదిమందిలో ఉన్నప్పుడు ఆయన చెప్పిన పని చేయటం ద్వారా ఇంటి గౌరవాన్ని నిలబెట్టాలి.

అనాది నుంచీ బాగా బతికిన కుటుంబం కదా తమది. కాపుగుట్టు గడప దాటించి అపర్ణ క్షమించరాని నేరం చేసినట్లే.

"ఆదెమ్మా! యాందిరా వాడు రంకెలేస్తాండు" కర్ర ఊతేసుకొంటూ ఇంట్లోకొచ్చాడు ఆమె జేజెబ్బ.

అంతలో ఆమె తల్లి పిచ్చమ్మ కూడా వచ్చింది కొంగున గింజల్తో. విషయం విని ఆదరాబాదరా అంగడికేసి నడిచింది.

"మా వాళ్ళంతా మీసాలు ఎగబట్టి బతికినోళ్ళే. యీనిలా ఎదవబతుకులు కాదు మావి" ఇంకా తగ్గలేదు వెంగళ్‌రెడ్డి.

"గోసులు బిగగట్టి పన్జేసిందాన్నే మీసాలు ఎగబట్టి బతికినాం. పనీ బాటా లేకుండా ఉత్త మీసాలు తిప్పుకుంటా వుంటే గోసిలోకి రాయే వచ్చేది" ముసలాయన గొణుక్కొంటూ కూసానికి ఆనుకొని పీట మీద కూచున్నాడు.

తన పూర్వీకుల దానధర్మాల గురించి గొంతెత్తి చాటుతున్నాడు వెంగళ్‌రెడ్డి.

"ఎందుకురా సిన్నోడా మీ నాయన మాటలన్నీ? కాల్చనా?" ముసలాయన అన్నాడు. "మా సంసారానికి పోను పదిమంది తిన్నేన్ని గింజలు మేం పండిస్తాన్నెం. ఆకలిగొన్నోల్లకు సంగటి పెడ్తాన్నెం. యీ పోరంబోకు నాకొడకాల బూములమ్మి తిరగలేదు" ఆయన గొంతులో బాధ సుడులు దిరిగింది.

బీడీ కట్టతో వచ్చింది పిచ్చమ్మ. "ఆ మాట అన్లేదని ఏడుస్తాండు సుబ్బన్న" చెప్పింది.

వెంగళ్‌రెడ్డి కోపం అపర్ణమీదకు మళ్ళింది.

తనకు ఎదురుచెప్పేంత ధైర్యం సుబ్బన్నకు లేదనీ, అంగడి వద్దకు వెళ్ళేందుకు బద్ధకించిన అపర్ణ ఇట్లా అబద్ధం చెప్పిందనీ, సుబ్బన్నను అనవసరంగా తిట్టించిందనీ కొంతసేపు వాగాడు.

తనకు సంఘంలో ఇంకా పరువు తగ్గలేదని ప్రకటించుకొనేందుకు అపర్ణను - 'పనీ బాటా లేకుండా ఇంటివద్ద కూచుని తిని కొవ్వుబట్టిన దాని'లాగా చిత్రించాడు.

"నా చెల్లెలుంది చూడు - దేవత. ఇప్పటికీ నేను గుడ్లురుముతే వలవల ఏడుస్తది. ఆడపిల్లంటే అట్లుండాల" చెబుతున్నాడు అతను.

'ఔనౌను. ఒంటిమీద సొమ్ములు అమ్ముకుతింటాన్నే పూరక సూస్తా వున్నెది గదా!' కసిగా అనుకొంది అపర్ణ.

* * * *

మా గన్నుగా నిద్రపట్టిన అపర్ణకు ఏవో పరిచయ శబ్ధాలు విన్పించి అలవాటుగా మెలకువ వచ్చింది.

తల్లి మంచంలోంచి గుసగుసలు

"ఎదిగిన పిల్లోల్లను పక్కన బెట్టుకొని యాందీ పోరంబోకు పని?" ఆమె గొంతు జాలిగా వున్నా బలమైన తిరస్కారాన్ని ధ్వనిస్తోంది.

ఆయన తన ప్రయత్నాన్ని ఆపుకున్నట్టులేదు.

తండ్రిమీద అంతులేని అసహ్యం కలిగింది అపర్ణకు. తన పక్క ముడుచుకు పడుకొని ఉన్న మేనత్త మీద చెయ్యేసింది. ఆమెకు మెలకువగా ఉన్నా గాఢ నిద్రను నటిస్తుంది.

తనకెందుకో ప్రతిరోజూ ఈ సమయానికే మెలకువ వస్తుంది.

పాపమని తెలిసీ - తల్లిదండ్రుల పెనుగులాటను ప్రతిరాత్రీ వింటూనే ఉంటుంది.

తనకే ఎలాగో వుంటుంది.

ఇక మేనత్తను తల్చుకొంటే జాలేస్తుంది.

అనుభవించాల్సిన వయస్సులో మరొకరి అనుభవాల్ని వింటూ మనస్సును కాల్చుకు బతకాల్సిన దుస్థితి చాలా భయంకరమైంది.

ఆయనకు బుద్ధుండాలి.

వృద్ధకన్నె అయిన చెల్లెల్నీ, మొగ్గకన్నె అయిన కూతుర్నీ పక్కనే వుంచుకొని తాను పశువులా ప్రవర్తించటం ఎంత హీనసంస్కృతి!

తన మేనత్త ఉత్త అమాయకురాలు.

ఆమె పెళ్ళికోసం కేటాయించిన బంగారు నగల్నీ, బంగారమంటి భూమినీ అన్నగారు అమ్ముకు తింటోంటే చూస్తూ ఊరకొంది.

ఇప్పుడు మోడై మిగిలివుంది.

ఆయన తమ పెళ్ళిళ్ళు చేయలేదు. కట్నం లేకుండా పెళ్ళాడేందుకు ఎవడూ ముందుకురాడు.

ఈ చెరసాలలోంచి బైటపడితే చాలనిపిస్తోంది. అంగవికలుడైనా పర్లేదు. తోడుంటే చాలు. అతన్ని కూడా తమ రెక్కల కష్టంతో తామే పోషించగలరు.

అత్త వొట్టి పిరికిగొడ్డు. ఎవరితోనైనా లేచి పోయేందుక్కూడా ధైర్యం లేదు. ఏ కులపోడు అయితేనేం – తమను మనిషిగా చూసేవాడు దొరికితే. ఇంకా 'అన్న' గౌరవం నిలపాలనే ఆమెకు.

మేనత్త మీద అంతులేని దయపుట్టింది అపర్ణకు. కాలుమీదేసి ఆమె చంకలోంచి ఎదలమీదుగా చేయి దూర్చి గట్టిగా కౌగిలించుకొంది.

తాను మగపిల్లాడయినా బావుండు.వయస్సునూ, వావి వరుసల్నీ పక్కనబెట్టి ఆమెను లేవదీసుకుపొయ్యుండేది. ఎక్కడయినా హాయిగా పనీ బాటా చేసుకు బతికేవాళ్ళు.

తమ స్థితిపట్ల బాధతోటి దుఃఖం కలిగింది అపర్ణకు. మేనత్తను బలంగా తనకేసి తిప్పుకొని బిగియార కౌగిలించుకొంటూ చెంపకు చెంప జేర్చి కన్నీరు కార్చింది.

తల్లి మంచం మీద శబ్ధాలు ఎక్కువైనాయి.

నిస్సహాయతతో కూడిన తల్లి మూలుగు.

ఆమెను వశపరచుకొనేందుకు శక్తిమేరా తండ్రి చేసే పెనుగులాట.

అన్నం వార్చిన గంజి తామిద్దరూ తాగితే, తల్లికి అది కూడా లేదు. ఎద్దులాగా తిని ఆమె మీద దాడి జేస్తున్నాడు ఆయన.

సంసారాన్ని ఏమాత్రం పట్టించుకోడు.

తాము కూలికి వెళ్ళేందుక్కూడా కుటుంబ గౌరవం అడ్డేస్తాడు. ఒక్కపూట తిండితో వొట్టి చేపల్లా వరటించి చావాల్సిందే.

'చెళ్'మన్న శబ్దంతో ఆలోచనల్నుంచి ఉలికిపాటుగా బైటపడింది అపర్ణ.

అమ్మ చెంప మరోసారి మోగిన శబ్దం.

దెబ్బ వెంటనే మూగవోయిన అమ్మ గొంతు.

అవకాశాన్ని వినియోగించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లున్నాడు ఆ పశువు.

లేచి కూచుంది అపర్ణ.

"అత్తా!" పిల్చింది.

మంచం దిగబోతోన్న అపర్ణను వారించబోయింది చంద్రమ్మ.

విదిలించుకొని మంచం దిగి అడ్డగోడమీద చేయి పెట్టింది. అగ్గిపెట్టె అందుకొని భగ్గున గీచి దీపం ముట్టించింది.

సర్దుకొనేందుకు కూడా సమయం చిక్కలేదు వెంగళ్‌రెడ్డికి. ఆదరాబాదరా పంచె చుట్టుకొంటూ లేచి కూచున్నాడు.

అతనికేసి చూపుల్ని కూడా తిప్పకుండా వాకిలి గడియ తీసింది అపర్ణ.

"బుడ్డెందుకమ్మే ముట్టించింది?" ఆమెను తినేసేలా చూస్తూ ప్రశ్నించాడు.

"బైటికి బోవాల" నిర్లక్ష్యంగా చెప్పింది.

"వాకిలి ఏ పక్కుండేదీ తెలీదూ?"

"మొబ్బుకు కనపల్లే"

ఆమె సమాధానాల శైలికి కోపం రవరవ తన్ను కొచ్చింది అతనికి.

"ఎందుకు కనబడ్తది? పనీబాటా లేకుండా తిని కండ్లకు కొవ్వు అడ్డపడింది. రేపుట్నుంచి దీనికి తిండి బెట్టకుండా ఎగరగొట్టే" భార్యను హెచ్చరించాడు.

"ఇప్పుడు కడుపునిండా తింటా వున్నెట్టూ" గొణుక్కొంటూ అడుగేసింది అపర్ణ.

"కొడ్తా నీయమ్మ! నీకు నోరు జాస్తయింది లంజముండా! ఎక్కడ ఏ మాట మాట్లాడాల్సింది తెలీకుండా ఉంది" అంటూ చేయిచేసుకోబోయి అప్పటికే ఆమె బైటకు జారుకోవటంతో ఆగాడు.

"నువ్వు బైటే చావు" రొప్పుతూ వాకిలేసి గడియపెట్టాడు.

మంచంమ్మీద ఊపిరి బిగపట్టి పడుకొని ఉంది చంద్రమ్మ.

"నాయనా! ఆదిలచ్చుమా! యాందొరే?" ఆదుర్దాగా అడిగాడు పంచలోని కుక్కిమంచం లోంచి ముసలాయన - బైటికొచ్చిన మనవరాల్ని .

కోపము, కసి, దుఃఖం కలగలిసి రాగా జేజెబ్బ పక్కన కూచుంది అపర్ణ.

"వాని జోలెందుకు బోతావురా సిన్నోడా! వాడొట్టి కుక్క నాయనా! దా...నాకాడే పండుకో తల్లీ!" ఆమెను ఆప్యాయంగా తనకేసి లాక్కొన్నాడు.

ఆయన దుప్పటిలో తలదాచుకొన్న అపర్ణకు దుఃఖం ఆగిందికాదు.

"ఊరుకో నాయనా! మాయమ్మవుగదూ! ఆదెమ్మ తల్లీ! ఊరుకో...." ఆమె వెన్ను నిమురుతూ ఊరడించసాగాడు.

ఆయన పిలుపు గుండె గాయాలకు లేపనం పూసినట్లుగా అన్పించి కన్నీళ్ళు జలజల రాలాయి అపర్ణకు. తల్లిపేరు పెట్టుకోవాలని ఎంతో తాపత్రయ పడ్డాడుట జేజెబ్బ - తనకు.

ప్రయత్నం ఫలించకపోవటంతో ఆయనొక్కడు మాత్రం తన్నా పేరుతో పిల్చుకొంటూ వుండేవాడట మొదట. కొడుకు అదలింపుల్తో ఆ భాగ్యానికీ నోచుకోలేక ఇప్పుడు చాటుమాటుగా తన తపన తీర్చుకొంటున్నాడు.

ఆయన పిలుపులో ఎంత ప్రేమ జాలు వారుతుందనీ! నోరారా అమ్మను పిల్చుకొన్నట్లే.

ఆ ప్రేమలో తడిసే పేరు అదెంత మొరటుదైతేనేం? అమృతమే కదా!

తండ్రి సంబోధన తనకు కృత్రిమంగా అన్పిస్తుంది. తన కోసం కాకుండా పదిమంది మెప్పుకోసం పెట్టుకున్న పేరులా అన్పిస్తుంది.

తమకోసం బతకటం ఆయన ఎప్పుడో మానుకొన్నాడు. ఆస్తంతా కరిగిపోయినా ఖద్దరు మత్తులోంచి కళ్ళు తెరవటం లేదు.

కడుపు కాలినపుడు కూలికెళ్ళి తమ కడుపునింపి వీపునిండా దెబ్బల మోస్తుంది అమ్మ.

ఆకలితో చచ్చినా పర్లేదుట. కూలికెళ్ళి కులగౌరవాన్ని మంటకలుపకూడదట. ఎన్నిరోజులని అర్ధాకలితో బతకాలి.

ఒంటి పూట తిండితో ఎంతకాలమని వరటించి వరటించి చావాలి.

"అత్త అట్లుండగానే నువ్వెక్కొస్తివి. ఈ నాకొడుకు మీకు పెండ్లేడజేస్తడమ్మా!" ముసలాయన గొంతు దుఃఖంతో వణికింది.

"కడుపునిండా సంగటి దొరుకుతే సాల్దు!" పెండ్లికంటే ఆకలే గొప్పదనే భావం ధ్వనించింది ఆమె గొంతులో.

"యాందిరా ఆదోడా అట్లంటవ్?" ఆయన గొంతు ఆశ్చర్యంగా వణికింది.

"నీకు ఒక్కపూట తిండి ఉంటే చాలబ్బా! రోజంతా అరగదు. మూడు పూటల తిన్నా ఇంకా ఆకలేసే మాకు ఒక్కపూట సగం తిండితో ఎట్లా బతకాల?" గొంతు పూడుకుపోయింది ఆమెకు.

విషయం బాగా అర్థమైంది ముసలాయనకు.

వలవల ఏడవటం మొదలెట్టాడు.

'కాపుగుట్టు గడప దాటకూడ'దన్నారేగానీ, ఇంట్లో మనుషులకు కూడా తెలీకుండా దాచేటట్లు చేసిన తండ్రిపట్ల అసహ్యమూ, తన స్థితిపట్ల ఆవేదన పెనవేసుకువచ్చాయి అపర్ణకు.

దుఃఖంతో సానబట్టిన కోపం బుసబుసమంటూ పైకి పొంగుకొచ్చింది.

"ఆయన మాకు పెండ్లిండ్లు జేయకుంటే మానే. కడుపునిండా తిండి బెడ్తేసాల్దు!" బిగ్గరగా అంది ఏడుపుల మధ్య.

ఆమెకేదో ఆవేశం ముంచుకొచ్చింది.

"ఆయన మాకు సంపాదించి పెట్టకుంటే మానె. మమ్మల్ను కూలికెన్నా పంపిస్తేనేం? అక్కడన్నా ఒక పూట కడుపునిండా సంగద్దినమా! ఇంట్లో వాళ్ళందరికీ సంగటి గింజలు తీసుకురామా! ఈ ఆకలితో ఎన్ని రోజులని సావాల?"

ఈయన ఖద్దరుచొక్కాలు కాలిపోను! యీయన పెద్దరికం ఏటగలిసిపోనూ! బరకో మెరకోదున్ని పైరు బెట్టిస్తే ఒక్కొక్కరం ముగ్గురంత పన్జేసి పంట ఇంటికి తేమా! మా తిండి ఖర్చు, మా పెండ్లి ఖర్చు మేమే సంపాయించుకోమా! యీని తిరుగుళ్ళకు ధూమెచ్చిపోనూ!" రోదనల మధ్య ఆమె గొంతు పెద్దగా రేగుతోంది.

ఆమె ఏడుపు వీధుల్ని ముంచి వాకిలిగుండా ఇంట్లోకి ప్రవహించి వెంగళరెడ్డిని కూడ కమ్ముకొంది. లేచెళ్ళి ఆమె నోరు మూద్దామనుకొన్నాడు. తన పరువు కొట్టుకుపోకుండా ఆపుదామనుకొన్నాడు. ఆమె ఏడుపు తన నగ్నత్వాన్ని తనకు గుర్తుజేస్తోంటే, లేచినవాడు కాస్తా నిస్సత్తువగా మంచంలో కూలబడ్డాడు.

పంచలో ఆపితే వీధికెక్కించేట్టుంది తన నగ్న స్వరూపాన్ని. వీధిలో అడ్డగిస్తే గుడిగోపురం మీదికి ఎగబాకించేట్టుంది.

తన దిగంబరత్వం ఇంత సిగ్గును కలిగిస్తుందని అతనెప్పుడూ ఊహించలేదు.

◆ స్వాతి మంత్లీ-7-3-1997 ◆